క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



భూమిపూజ నిర్వహిస్తున్న ఎంపీపీ దాస్

సోంపేట: రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. జింకిభద్ర పాత చెరువు నుంచి సోంపేట–బారువ ప్రధాన రహదారి వరకు సి.సి రహదారి నిర్మాణానికి ఎంపీపీ గురువారం భూమిపూజ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.7 లక్షలతో ఈ పనులు నిర్మిస్తున్నట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాహుకారి జానీ, తామాడ చంద్రశేఖర్, బత్తుల శంకర్, పెద్దకోట అనంత్, తామాడ సూరి, ఎన్ని అజయ్, రాజాం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



మందులు అందజేస్తున్న ట్రస్ట్‌చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి

ఇచ్ఛాపురం : చాట్ల రామలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ట్రస్ట్ చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి అధ్యక్షతన జెమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో గురువారం స్వర్ణభారతి విద్యాసంస్థల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 500 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం 50 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ సుజాత, వైద్యులు దయాకర్, కిరణ్‌కుమార్, గిరిధర్, రత్నం, కీర్తి, తారా, శిరీష పాల్గొన్నారు.

పట్టాల రిజిస్ట్రేషన్లు వేగవంతం



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ భరత్‌నాయక్

ఇచ్ఛాపురం రూరల్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు సంబంధించిన పట్టాల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలని పలాస ఆర్డీఓ డాక్టర్ భరత్ నాయక్ అధికారులకు సూచించారు. గురువారం ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఇచ్ఛాపురం అర్బన్‌లో 715 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో స్పెషలాఫీసర్లు, నోడల్ ఆఫీసర్లు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ ఎం.భాస్కర అప్పారావు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, సోంపేట ఇన్‌చార్జి ఎంపీడీఓ రామారావు, ఉప తహసీల్దార్ బి.శ్రీహరి పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డికి ఘన నివాళి



రామకృష్ణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పార్టీ నేతలు

పలాస: విప్లవ స్వాప్నికుడు, సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమొక్రసీ నాయకుడు రామకృష్ణారెడ్డికి గురువారం పలాస సూదికొండ కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. అతని సహచరి పి.ఓ.డబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్యపై పోలీసులుదాడులు చేసినప్పటికీ ఆమెకు అన్ని రకాలుగా అండదండగా నిలిచిన వ్యక్తి రామకృష్ణారెడ్డి అని కొనియాడారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, ఐ.ఎఫ్.టి.యు. జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, పి.డి.ఎస్.యు. రాష్ట్ర కార్యదర్శి ఎం.వినోద్, మామిడి భీమారావు, బదకల ఈశ్వరమ్మ, సోమేశ్వరరావు, బి.కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం



సమీక్ష నిర్వహిస్తున్న సర్పంచ్ కాల్ల సంజీవరావు

కోటబొమ్మాళి: గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వలంటీర్లు, గృహసారథులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోటబొమ్మాళి మేజర్ సర్పంచ్ కాల్ల సంజీవరావు అన్నారు. గురువారం కోటబొమ్మాళి పంచాయతీ కార్యాలయంలో పథకాల పంపిణీపై సమీక్షించారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ వచ్చేలా సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ అనపాన బాలకృష్ణ, ఎంఎల్‌ఓ తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాట్లు

- జేసీ నవీన్, సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్
- టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సౌకర్యాల పరిశీలన



ఇచ్ఛాపురం రూరల్: కీర్తిపురం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్ఓ సుదర్శన్ దొర



టెక్కలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ కోసం పరిశీలన చేస్తున్న జేసీ నవీన్‌కుమార్, సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్

టెక్కలి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున టెక్కలి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు సామగ్రి పంపిణీ కోసం ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్‌లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ నవీన్‌కుమార్ ఆదేశించారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు జేసీతో పాటు టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తదితరులు పలు గదులను పరిశీలించారు. నియోజకవర్గంలో మొత్తం పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సామగ్రి నిల్వ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లుపై చర్చించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ నాగరాజు, తహసీల్దారు బాలమురళీకృష్ణ, ఎన్నికల డీటీ శంకరరావు, డీఎస్‌ఓ నందా, వీఆర్‌లు మల్లేశ్వరరావు, శ్యామ్, రామ్‌జీ, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతులు తప్పనిసరి..

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని 299 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో ఉండాలని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బి.సుదర్శన్ దొర అన్నారు. గురువారం ముచ్చింద్ర, కేదారిపురం, కొళిగాం, కీర్తిపురం, తేలుకుంచి, రత్తకన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పాడైన రోప్‌లను బాగుచేయాలని, విద్యుత్, రన్నింగ్ వాటర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ ఎం.భాస్కర అప్పారావుకు సూచించారు. ఆయన వెంట ఎన్నికల ఉప తహసీల్దార్ బలివాడ శ్రీహరి, ఆర్‌ఐలు చూడామణి రెడ్డి, శ్రావణ్, వీఆర్వోలు ఉన్నారు.

రిగ్గింగ్ బూత్‌లపై ఫిర్యాదు



రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో రిగ్గింగ్‌లు జరిగే బూత్‌ల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు విన్నవించారు. ఈ మేరకు గురువారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు.కొన్నేళ్లుగా ఎన్నికల సమయాల్లో టీడీపీ అభ్యర్థి అచ్చెన్నాయుడు దౌర్జన్యంగా కొన్ని పోలింగ్ బూత్‌లలో రిగ్గింగ్‌లకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. అటువంటి బూత్‌లలో ఈ సారి ఎటువంటి రిగ్గింగ్‌లు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ నాయకులు చేసిన హింసాత్మక ఘటనలను దువ్వాడ వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని కోరారు. అనంతరం డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు.

బాతుపురంలో గ్రామ ముఖద్వారం ప్రారంభం



ప్రారంభోత్సవ పూజలు చేస్తున్న దాత, గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు రూరల్:బాతుపురం బత్తిని దానేసు జ్ఞాపకార్థం బత్తిని కుటుంబ సభ్యులు సుమారు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ ముఖద్వారాన్ని గురువారం ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ముఖద్వారాన్ని ప్రారంభించి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. నిర్మాణదాత బత్తిని దమయంతికి గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు తామాడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కొరత లేకుండా చర్యలు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: వేసవిలో పురపాలక ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధికారులకు సూచించారు. స్థానిక పురపాలక సంఘం సమావేశ మందిరంలో గురువారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. 16 అంశాలతో కూడిన అజెండాపై కౌన్సిల్ సభ్యులు చర్చించారు. దినవారిబజారు, వీధిగుత్తలు, కమేళాల కోసం నిర్వహించిన బహిరంగ వేలంలో గతం కంటే ఈ ఏడాది ఆదాయం తగ్గిందని, మరోసారి బహిరంగ వేలం పాటకు పిలవాలని సభ్యులు కోరడంతో ఆ అంశాలను రద్దు చేశారు. ఏయే ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదో వారికి నీటిపన్నును మినహాయింపునివ్వాలని కౌన్సిలర్లు కోరారు. వేసవిలో నీటి ఎద్దడిని నివారించేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు షార్ట్‌టెండర్లు పిలవాలన్నారు. పన్నుల వసూళ్లకు వెళ్లేటప్పుడు ప్రజలతో దురుసుగా మాట్లాడకుండా మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాభాల స్వర్ణమణి కమిషనర్ ఎన్.రమేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు



జోగేంద్ర మహాపాత్రోను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కంచిలి: విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని మండల విద్యాశాఖాధికారి–2 కె.చిట్టిబాబు అన్నారు. జలంత్రకోట జెడ్పీ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన జోగేంద్ర మహాపాత్రో సన్మాన సభను పాఠశాల ఆవరణలో హెచ్ఎం భాస్కర్ మిశ్రా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మహాపాత్రో సేవలు కొనియాడి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొయిరా గౌడో, వైఎస్సార్ సీపీ నేత ప్రకాష్ పండా, ఉపాధ్యాయులు డొంబురు గౌరి, నంద, గోపాలకృష్ణ, తారకేష్ చౌదరి, సంతోష్ గౌడో, విద్యాకమిటీ చైర్మన్ మినకేతన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆధ్యాత్మిక భావన అవసరం



మాట్లాడుతున్న మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి

టెక్కలి: విద్యార్థి స్థాయి నుంచే ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. టెక్కలి పట్టణంలో శ్రీ వేంకటేశ్వర గీతా భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి గోవింద నామాల సప్తాహం కార్యక్రమానికి గురువారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు–ఆధ్యాత్మిక బోధన విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ డైరెక్టర్ టంకాల పావనిరాణి, నిర్వాహకులు టి.బి.జె.గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నేడు కంచిలిలో జెడ్పీ చైర్‌పర్సన్ పర్యటన

కంచిలి: జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్‌లు శుక్రవారం కంచిలి మండలంలో పర్యటిస్తారు. పెద్ద కొజ్జిరియా, అంపురం, మఠం సరియాపల్లి, కె.బి.నౌగాం, డి.జి.పురం, పోలేరు పంచాయతీల పరిధిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, పూర్తయిన పనుల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పలాస/కాశీబుగ్గ: మండలంలోని బ్రాహ్మణతర్లా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం మరమ్మతులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పలాస డీఈ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణతర్లా, లక్ష్మీపురం, గరుడఖండి, అనంతగిరి, వెంకటాపురం, టెక్కలిపట్నం, కేశుపురం, బంటుకొత్తూరు, కేదారిపురం, పెదంచల, చినంచల, రాజగోపాలపురం, ఈదురాపల్లి, వీరభద్రాపురం, అమలకుడియా, పూర్ణభద్ర పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నీలకంఠసాగర్ చెరువు పరిశీలన



ఆర్డీఓతో మాట్లాడుతున్న రైతులు

సోంపేట: మండలంలోని జింకిభద్ర గ్రామ పరిధిలోని నీలకంఠ సాగర్ చెరువులో మట్టిని ట్రాక్టర్ల ద్వారా తీసుకెళ్లేందుకు అనుమతులు ఇవ్వాలని రైతులు కోరారు. ఈ విషయమై ఇటీవల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయగా గురువారం ఆర్డీఓ భరత్ నాయక్, తహసీల్దార్ కె.విజయ్ కుమార్ చెరువును పరిశీలించారు. పాతికేళ్లుగా చెరువు పనులు చేపట్టక నీరు నిల్వ ఉండటం లేదన్నారు. ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలిస్తే చెరువులో నీరు నిల్వ ఉంటుందని, అధికారులు స్పందించి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులకు దరఖాస్తు చేసుకుంటే అనుమతులు మంజూరు చేస్తారని చెప్పారు. ఇరిగేషన్ ఏఈ సూర్యప్రకాస్ తదితరులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్



సోంపేట: మాట్లాడుతున్న అదనపు న్యాయమూర్తి భాస్కరరావు

సోంపేట: సోంపేట కోర్టుల సముదాయంలో మార్చి 9న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ మార్చి 16కు వాయిదా పడినట్లు మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షుడు, జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి పి.భాస్కరరావు తెలిపారు. కోర్టుల సముదాయంలో గురువారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీపడదగిన సివిల్, క్రిమినల్ కేసులు రాజీ చేసుకుని ఇరుపక్షాల వారు ప్రయోజనం పొందాలన్నారు. సమావేశంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాసలో ఈ నెల 9న నిర్వహించాల్సిన జాతీయలోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఈ నెల 16కు మార్చినట్లు పలాస కోర్టు ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్. ప్రసన్నలత ఒక ప్రకటనలో తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



సోంపేట: బారువ డిగ్రీ కళాశాల వద్ద ఫ్లెక్సీతో విద్యార్థులు



వజ్రపుకొత్తూరు రూరల్: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహశీల్దార్

సోంపేట: ఓటు హక్కును 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని నెహ్రూ యువ కేంద్రం(శ్రీకాకుళం)ప్రతినిధులు పేర్కొన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బారువ డిగ్రీ కళాశాలలో గురువారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఓటు విలువ వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.రామారావు, నేషనల్ యూత్ వలంటీర్ గణేష్, నెహ్రూయువ కేంద్ర ప్రతినిధులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే వజ్రాయుధం అని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలని తహశీల్దార్ సురేష్ అన్నారు. వజ్రపుకొత్తూరులో గురువారం ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతి, కులం, భాష, వర్గ విభేదాలకు తావులేకుండా ఎలాంటి ఒత్తిడికి ప్రభావితం కాకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు వాయిలపల్లి గిరిరాజ్, పవిత్ర, వజ్రపుకొత్తూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తారకేశ్వరరావు పండా, రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..


క్రీడాకారిణికి అభినందనలు



శైలజను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సోంపేట : శ్రీకాకుళంలో ఇటీవల వ్యాయామ క్రీడల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా అంతర పాఠశాలల క్రీడా పోటీల్లో బేసి రామచంద్రాపురం ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని శాసనపురి శైలజ సత్తాచాటింది. డిస్క్ త్రో, షార్ట్ పుట్ విభాగాల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. విద్యార్థినితో పాటు వ్యాయమ ఉపాధ్యాయిని పైల పద్మావతిలను గురువారం ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఆవరణలో అభివృద్ధి పనులు



కొత్తమ్మతల్లి ఆవరణలో నిర్మించిన గచ్చు

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయ ఆవరణలో రూ.15 లక్షల వ్యయంతో కాంక్రీట్(గచ్చు) నిర్మాణ పనులు చేపట్టారు. గతంలో వర్షం పడితే ఆవరణ బురదగా మారి భక్తులు ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో కాంక్రీటు పనులు చేపట్టినట్లు ఈఓ వి.రాధాకృష్ణ గురువారం తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు

సోంపేట: ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోంపేట తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం ధర్నా చేపట్టారు. అనంతరం డీటీ కూర్మారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు జి.భీమారావు, రాష్ట్ర కౌన్సిలర్ జి.రాజేష్, సోంపేట, కంచిలి మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పలాస ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

కాశీబుగ్గ: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా టెక్కలి ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అటల్ ఇన్నోవేషన్ చాలెంజ్ సీజన్–02 పోటీల్లో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బి.గాయత్రి, జశ్వంత్ పాత్రో, కె.గౌతమ్‌లు గైడ్ టీచర్ షణ్ముఖరావు ఆధ్వర్యంలో రూపొందించిన ఉమెన్ సేఫ్టీ స్మార్ట్ పవర్ స్టిక్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం డి.దాశరథి, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

శాస్త్రోక్తంగా ప్రసన్నాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ



పూజలందుకుంటున్న స్వామివారు

ఇచ్ఛాపురం: పట్టణంలో నర్మదేశ్వరాలయం ఆవరణలో ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. హనుమత్ ఉపాసకులు పెంట శ్రీనివాసశర్మ, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రాణప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఫీజులతో సంబంధం లేకుండా హాల్‌టికెట్ల పంపిణీ

కాశీబుగ్గ: కాలేజీ ఫీజులతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికి హాల్‌టికెట్ అందించాలని, ఈ విషయంలో నిబంధనలు అతిక్రమించే కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవికుమార్ డిమాండ్ చేశారు. గురువారం కాశీబుగ్గ సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులను యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తే 949075684 నంబర్‌కు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు పవన్‌కుమార్, సాయికుమార్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి



గోకర్ణపురంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి ఫలాలు అందాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనతోనే సాధ్యమని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోకర్ణపురం ప్రధాన వీధిలో సీసీ రోడ్డు, అంపురం సచివాలయ పరిధిలోని పద్మతుల గ్రామంలో సీసీ రోడ్డు, బూరగాంలో సీసీ రోడ్డు పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, సర్పంచ్ యారడి ఆనందరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డు కేశవపాత్రో, దుర్గాసి ధర్మారావు, తలగాన తిరుపతి, మద్ది అప్పారావు, మద్ది ఆదినారాయణ, మునకాల వీరాస్వామి, మద్దు వెంకటరావు, మద్దు వెంకటేశ్వరరావు, మద్దు అభిరామ్ పాల్గొన్నారు.

నేడు చిన్నబరంపురంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

మందస: మందస పంచాయతీ చిన్నబరంపురంలో శుక్రవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు న్యాయవాది మెట్ట కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. షిరిడీసాయి ధ్యానమందిరం వార్షికోత్సవం సందర్భంగా మేలుకొలుపు, హారతితో కార్యక్రమాలు ప్రారంభమై పవళింపు సేవతో ముగుస్తాయని పేర్కొన్నారు. భక్తులంతా పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

హెచ్‌ఎం దంపతులకు సన్మానం



ఖగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

కవిటి: ప్రభుత్వ ఉద్యోగికి వృత్తిజీవితంలో చేసిన సేవలే సమాజంలో గుర్తింపునిస్తాయని సర్పంచ్ బద్రి ప్రకాష్, ఎంఈఓ ధనంజయమజ్జి అన్నారు. గురువారం బి.గొనపపుట్టుగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు టి.ఖగేశ్వరరావు ఉద్యోగ విరమణ సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో ఖగేశ్వరరావు విశేష సేవలందించారని కొనియాడారు. నాడు–నేడు పథకంలో బిగొనపపుట్టుగ పాఠశాల పనితీరు జిల్లాస్థాయిలోనే మంచి పేరు సంపాదించిందన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు హెచ్ఎం ఖగేశ్వరరావు, శ్రీదేవి దంపతులకు దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం బల్లెడ బాబూరావు, ప్రధానోపాధ్యాయులు సనపల రామకృష్ణ, బెందాళం మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండుచేపల తయారీ యంత్రం ప్రారంభం



మిషన్‌ను ప్రారంభిస్తున్న అధ్యక్షుడు భీమసేన్, సర్పంచ్ దమయంతి

కవిటి: సముద్రంలో వేటాడే సమయంలో లభించే చేపల ఉత్పత్తులను ఎండుచేపలుగా మార్చి వాటిని మంచి ధరకు అమ్ముకోవడం ద్వారా సంప్రదాయ మత్స్యకారులకు లబ్ధి చేకూర్చడమే ధ్యేయమని మండల మత్స్యకార రైతు ఉత్పత్తిదారుల సంఘాల అధ్యక్షుడు కాయ భీమసేన్ అన్నారు. గురువారం సీహెచ్ కపాసుకుద్దిలో మత్స్యకారులకు కవిటి ఏపీజీవీబ్యాంక్ రుణం ద్వారా మంజూరైన ఎండుచేపల తయారీ యంత్రాలను సర్పంచ్ కె.దమయంతితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మత్స్యకార రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.